## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసంలో భాగంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లి శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు భక్తి శ్రద్ధతో పూజలు చేశారు. వడ్డవల్లిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ, ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మొక్కపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ మంగళవారం వేద్యసేవలు అందించారు. డాక్టర్ వెంకటకృష్ణ కుమార్ 40 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అందులో 26 మందికి బీపీ మందులు, 19 మందికి షుగర్ మందులు నెలకు సరిపడ మందులను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘ కాలపు వ్యాధులు ఉన్న వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సీపీ రమణ, ఎంఎల్‌హెచ్ శివ మాధురి, ఏఎన్ఎం నాగలక్ష్మీ, ఆశకార్యకర్తలు పద్మా, పార్వతి తదితరులు ఉన్నారు.

### పిల్లలకు పరీక్షలు.. తల్లుల పరిశీలన



బాలెమర్రు(క్రోసూరు): ప్రభుత్వ బడిలో పిల్లల చదువులపై తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని బాలెమర్రు ప్రాథమిక పాఠశాలలో తమ పిల్లలు రాసిన సమ్మేటివ్ పరీక్ష పత్రాలను తల్లిదండ్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శరత్ మాట్లాడుతూ 5వ తరగతి విద్యార్థులు ఏ విధంగా పరీక్షలు రాస్తున్నారు, వారి ప్రొగ్రెస్‌ను తెలియపరిచేందుకు తల్లిదండ్రులను పిలిపించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లులు తమ పిల్లలు రాసిన పేపర్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళికలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

### నీమాస్త్రం తయారీపై అవగాహన



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతు రాంభూపాల్‌రెడ్డి పొలంలో పొలంబడి కార్యక్రమం మంగళవారం జరిగింది. రబీ సీజన్‌లో వరికి వచ్చే తెగుళ్ల, కాండం తొలిచే పురుగు, రసం పీల్చే పురుగు నివారణకు.. సస్యరక్షణ చర్యలను అధికారులు తెలియజేశారు. వీటికి ప్రధానంగా నీమాస్త్రం బాగా పని చేస్తుందని, రైతులకు నీ మాస్త్రం తయారీ విధానంపై ఆర్బీకే వద్ద మాస్టర్ ట్రైనీ సైదయ్య అవగాహన కల్పించారు. నీమాస్త్రంకు 200లీటర్లు నీరు, 10 కేజీల వేపాకు గుజ్జు, 10 లీటర్ల పశు మూత్రం, రెండు కేజీల పేడ కావాలన్నారు. ఆర్బీకే వీఏఏ దివ్య, ప్రసన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### తీగ టమాటా పంటతో అధిక దిగుబడులు

రాజుపాలెం: మండలంలో రైతులు పెద్ద మొత్తంలో టమాటా పంటను సాగు చేస్తున్నారని ఉద్యాన అధికారి డి.నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాజుపాలెంలో తీగ సాగు పద్ధతిలో పండిస్తున్న టమాటా పంటను ఉద్యాన అధికారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టమాటా పంట సాగు చేస్తున్న రైతు చొక్కా శ్రీనివాసరావుకు సూచనలు, సలహాలను ఇచ్చారు. దీని వల్ల పంట దిగుబడి పెరుగుతుందని, ఎక్కువ కాలం కాపు కాస్తుందని తెలిపారు. ఈ విధానంలో పంట సాగు చేయడం వల్ల ఎకరాకు రూ.80 వేలు ఖర్చు అవుతుందని కానీ దిగుబడి మూడు రెట్లు అవుతుందని తెలిపారు. నేలపై సాగు చేయడం ద్వారా సూర్యరశ్మి ఒకవైపే పడుతుందని, కాపు కూడా ఒకవైపే కాస్తుందని తెలిపారు. తెగుళ్లు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతీ రైతు తీగ పద్ధతిలోనే టమాటాను సాగు చేస్తున్నట్లు తెలిపారు.

# సృజనాత్మకతను వెలికి తీసేందుకే ముగ్గుల పోటీలు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- కోలాహలంగా సత్తెనపల్లి రూరల్ మండల స్థాయి ముగ్గుల పోటీలు



మంత్రి అంబటి రాంబాబుతో సత్తెనపల్లి రూరల్ మండల స్థాయి ముగ్గుల పోటీల్లోని విజేతలు

సత్తెనపల్లి: తెలుగు సంప్రదాయాల సంస్కృతికి ప్రతీకగా సంక్రాంతి పండుగ విశిష్టంగా నిలుస్తోందని, మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే ముగ్గులు పోటీలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా సత్తనపల్లి రూరల్ మండల స్థాయి ముగ్గుల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలకు సత్తెనపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి గ్రామ స్థాయి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో 83 మంది మహిళలు హాజరయ్యారు. పోటీతత్వంతో మహిళలు తమలోని కళా నైపుణ్యతను ప్రదర్శిస్తూ ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన అద్దేపల్లి శాంతి (ధూళ్ళిపాళ్ల)కు రూ.25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన సోమినేని శిరీష (భీమవరం)కు రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన తిరువీధుల తిరుమలేశ్వరి (ఫణిదం)కు రూ.10 వేలు, చతుర్ధ స్థానం సాధించిన అద్దేపల్లి సునీత (ధూళ్ళిపాళ్ల)కు రూ. 5వేలు, ఐదవ స్థానం సాధించిన జి.కోటేశ్వరమ్మ (పెదమక్కెన)కు ప్రత్యేక బహుమతిని మంత్రి అంబటి రాంబాబు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ పోటీలకు ప్రతి సంవత్సరం మహిళల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తుందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన మహిళలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ధూళ్ళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ, ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీత హాసంతి, నాయకులు అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి, కొర్లకుంట వెంకటేశ్వర్లు, నందిగం యల్లమంద, చిలుకా జయపాల్, నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

**తెలుగు సంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీలు**

ముప్పాళ్ళ: తెలుగు సాంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీలని ఉమెన్స్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా.గీతాహాసంతి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో మంగళవారం మండల స్థాయి వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను గ్రామస్థాయిలో విజేతలైన వారంతా పాల్గొన్నారు. పోటీల్లో ముప్పాళ్ళకు చెందిన పి.రామలింగేశ్వరి ప్రథమ బహుమతి సాధించగా, లంకెలకూరపాడుకు చెందిన డి.అనురాధ ద్వితీయబహుమతి, నార్నెపాడుకు చెందిన పి.సునీత తృతీయబహుమతి, మాదలకు చెందిన ఎన్.రత్నకుమారి నాల్గవ బహుమతి, దమ్మాలపాడుకు చెందిన టీ.మాధవి ఐదవబహుమతి సాధించారు. విజేతలకు డా.గీతాహాసంతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాములమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డా.గీతాహాసంతి



మొదటి బహుమతి పొందిన ముగ్గు



ప్రథమ స్థానం సాధించిన ముగ్గు



ద్వితీయ స్థానం సాధించిన ముగ్గు



తృతీయ స్థానం సాధించిన ముగ్గు



చతుర్ధ స్థానం సాధించిన ముగ్గు

### ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



దమ్మాలపాడు ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగిమంటలు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు మండల పరిషత్ ప్రాథమిక (రామాపురం) పాఠశాలలో ముందుగానే సంక్రాంతి శోభ సంతరించుకుంది. మంగళవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు వేసి సాంప్రదాయ దుస్తులతో ఆట, పాటలు, కోలాటంతో సందడి చేశారు. సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు కూడా సాంప్రదాయంగా దుస్తులు, చిన్నారులు వేషధారణలు, సాంప్రదాయ నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది.

### పాఠశాల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

ఎంఈఓ జ్యోతికిరణ్



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ జ్యోతికిరణ్

నకరికల్లు: పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో ప్రధానోపాధ్యాయులందరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ కె.జ్యోతికిరణ్ సూచించారు. 2023–24 విద్యాసంవత్సరంలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై ప్రధానోపాధ్యాయులతో మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరానికి గాను బడ్జెట్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. 2021–22కు సంబంధించిన విద్యార్థుల సంఖ్య, మంజూరైన నిధులు, ఖర్చులు, ఈ ఏడాది పాఠశాలలకు అవసరమైన వసతుల గురించి పేరెంట్స్ కమిటీకి తెలియజేయాలన్నారు. పీఎంసి సభ్యులను సమన్వయం చేసుకుని పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, ఆవాస ప్రాంతాల ప్రణాళికలు సిద్ధం చేసుకుని నివేదికలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.రంగాదేవి, కట్టా కోటేశ్వరరావు, పి.జాకబ్, వి.వెంకట్రావు, శేషగిరిరావు, షేక్.రసూల్, సీఆర్‌పిలు, సీసీ ఎస్. అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



అమరావతి- బెల్లంకొండ డబుల్‌లైన్ అనుమతి జీఓను చూపుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తదితరులు

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- త్వరలో అమరావతి – బెల్లంకొండ డబుల్‌లైన్ రోడ్డుకు శంకుస్థాపన : ఎమ్మెల్యే శంకరరావు

గుంటూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మంగళవారం నగరంలోని స్వర్ణభారతినగర్ సమీపంలోగల పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ వాసుల చిరకాల కోరికైన అమరావతి – బెల్లంకొండ డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి ముందడుగు పడటం సంతోషకరమన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో సుమారు 250 కిలోమీటర్ల మేర నేషనల్ హైవేలు అభివృద్ధి చేస్తున్నామన్నారు.

**ఎన్నికల హామీ నెరవేరబోతోంది..**

ఎన్నికల ముందు అమరావతి – బెల్లంకొండ రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చానని.. ఈ హామీ నెరవేరే సమయం వచ్చిందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరావు తెలిపారు. అమరావతి – బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.149 కోట్లతో నిధులు మంజూరయ్యాయన్నారు. ఆ మేరకు జీఓ విడుదలైందని జీఓ ప్రతిని చూపించారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యటిస్తారని అమరావతి – బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డుకు శంకుస్థాపన, అదేవిధంగా అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, క్రోసూరులో పాలిటెక్నిక్ కాలేజీ భవన నిర్మాణాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణం వల్ల సుమారు 80 కిలో మీటర్లు దూరం కలిసి వస్తుందన్నారు. రూ.60 కోట్ల నాబార్డ్ నిధులు బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు నియోజకవర్గంలో సుమారు 90 శాతం రోడ్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# కరోనా నియంత్రణకు మాస్కుల వితరణ



కలెక్టర్ శివశంకర్‌కు మాస్కులు అందిస్తున్న నాగసాయిప్రసాద్

సత్తెనపల్లి: కరోనా విలయతాండవం చెందకుండా నియంత్రణకు వినియోగించే 500 మాస్కులను వితరణ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ నాగసాయి ప్రసాద్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను మంగళవారం నరసరావుపేటలో కలిశారు. ఈ సందర్భంగా నాగసాయిప్రసాద్ మాట్లాడుతూ సత్తెనపల్లి డివిజన్ ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయానికి అనేక సమస్యల మీద విన్నవించుకోనడానికి వచ్చేటటువంటి వారు మాస్కులు వెంట తీసుకుని రావడం మర్చిపోతే ఇబ్బంది పడకుండా ఉండడం కోసం ప్రజల ఉపయోగం కోసం కలెక్టర్‌కు 500 మాస్కులు అందజేశామన్నారు. సత్తెనపల్లి పట్టణ పరిధిలో ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కార్యాలయాన్ని నిర్మించుకోవడానికి అనుకూలంగా స్థలాన్ని కేటాయించాలని కోరారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ద్వారా సత్తెనపల్లి డివిజన్ పరిధిలో టీబీ వ్యాధితో ఇబ్బంది పడుతున్న 100 మంది వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు అందించడానికి సత్తెనపల్లి రావలసిందిగా కలెక్టర్ శివశంకర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు తుమ్మల వెంకటేష్, సెక్రటరీ బి.కమలాకర్, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు పూనూరి కృష్ణకుమారి, పిడతల రమాదేవి, పవన్ కళ్యాణ్, మస్తాన్ వలి, తదితరులు ఉన్నారు.

# వైభవంగా చతుర్థి మహోత్సవాలు



ప్రత్యేక పుష్పాలంకరణలో వినాయకస్వామి



విశేషాలంకారంలో వినాయకుడు

అచ్చంపేట: పవిత్ర కృష్ణానది ఒడ్డున గల చామర్రు గ్రామంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. 108వ సంకటహర చతుర్థి మహోత్సవాలు జరుపుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు ఉప్పల శ్రీనివాసమూర్తి తెలిపారు. ప్రభాత సేవతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం నుంచి పవిత్ర కృష్ణానదీ జలాలను అష్టోత్తర శత కలశాలతో మహిళలు శోభాయాత్రగా.. మంగళ వాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భజన కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు మహా స్నపన, విశేష పుష్పార్చన, అష్టోత్తర శత సంఖ్య గణపత్య దర్వశీర్ష హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి, మహా నివేదన, పంచ హారతులు, నీరాజన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు**

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలోని వినాయకునికి మంగళవారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు జగర్లమూడి సాయి స్వామి వారికి వేకువ జామున మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకారం గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాలను అందజేశారు.



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళా భక్తులు

# ప్రతిరోజు 4,250 మందికి ఉపాధి కల్పించాలి

ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: ఉపాధిహామీ పనులకు జాబ్ కార్డుదారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లు మండలంలో ప్రతిరోజు 4,250 మందికి ఉపాధిహామీ పని కల్పించేందుకు లక్ష్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయపనులు ముమ్మరంగా ఉన్నప్పటికీ డిమాండ్‌కు తగినట్లుగా కూలీలు ఉపాధిపనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. మేట్‌లను ఫీల్డ్‌అసిస్టెంట్లు సమన్వయం చేసుకుని నిర్ణయించినట్లుగా పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసి కృష్ణకుమారి, ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

- కేసుల పరిష్కారంలో న్యాయవాదుల తోడ్పాటు అవసరం
- సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగ వెంకటలక్ష్మీ



న్యాయవాదులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మీ

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికారకమిటీ చైర్మన్ డీ.నాగవెంకటలక్ష్మి అన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ హాల్లో సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డీ.నాగవెంకటలక్ష్మీ అధ్యక్షతన ఫిబ్రవరి నెల 11 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జడ్జి నాగవెంకటలక్ష్మీ మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా సివిల్, క్రిమినల్, తదితర కేసులు పరిష్కరించబడేందుకు న్యాయవాదులు తోడ్పాటు అందించాలి అన్నారు. ఇప్పటి వరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి, న్యాయ విజ్ఞాన సదస్సులకు పాల్గొని వాటి యొక్క లక్ష్యాలను నెరవేర్చే దిశలో వీరి సమష్టి కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో జరగబోయే లోక్ అదాలత్ లో కుడా వీటి యొక్క ప్రాముఖ్యతను కక్షి దారులకు వివరించి ఎక్కువ కేసులు పరిష్క రించబడేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, ప్రభుత్వ న్యాయవాదులు బగ్గి నరసింహరావు, షేక్ బాలి సైదా, న్యాయవాదులు పీ.సీ.హెచ్ వెంకట కోటయ్య, బీ.ఎల్ చిన్నయ్య, చలువాది చిన సత్యానారాయణ, దివ్వెల శ్రీనివాసరావు, బీ.ఎల్ లక్ష్మీ కోటేశ్వరరావు, ఈ.ఏడు కొండలు, గంగూరి అజయ్ కుమార్, ఉడుముల విద్యా సాగర్ రెడ్డి, ఆకుల నాగార్జున, గంటా వెంకట శివ, పెండ్యాల భరత్, న్యాయవాదులతోపాటు యువ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.